# బీఆర్ఎస్‌తోనే మరింత అభివృద్ధి

- గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వ ప్రాధాన్యం
- రిజర్వేషన్ల పెంపు సీఎం కేసీఆర్ ఘనతే
- కాంగ్రెస్ పార్టీకి అతీగతి లేదు.. ఆ పార్టీ నాయకుల మాటలకు గ్యారంటీ లేదు
- నోముల భగత్‌ను గెలిపించి.. అభివృద్ధిని కొనసాగించండి
- రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్
- హాలియాలో గిరిజన ఆత్మగౌరవ సభ

హాలియా, అక్టోబర్ 29 : నాగార్జునసాగర్ నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలంటే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలంతా కారు గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్‌ను మరోసారి అఖండ మెజార్టీతో గెలిపించాలని రాష్ట్ర గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ పిలుపు నిచ్చారు. ఆదివారం హాలియాలోలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన గిరిజన ఆత్మగౌరవ సభలో ఆమె ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, ట్రైకార్ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్‌నాయక్, రాష్ట్ర గిరిజన కోఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ వాల్యానాయక్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పాలనలో గిరిజనులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందారన్నారు. తండాలను గ్రామపంచాయతీలుగా చేయడంతో పాటు, వాటిని అభివృద్ధి చేశారని, ఆరు శాతం ఉన్న గిరిజన రిజర్వేషన్లను 10 శాతానికి పెంచారని పేర్కొన్నారు. సబ్బండ వర్గాల సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పాలన సాగుతుందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలవుతున్నాయన్నారు. దేశంలో వ్యవసాయంతో పాటు అన్ని రంగాలకు 24 గంటల విద్యుత్ అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అన్నారు. రాష్ట్రంలో 24 గంటల విద్యుత్ అందిస్తే తానే గులాబీ కండువా వేసుకొని రాష్ట్రమంతా ప్రచారం చేస్తానని ఆనాడు సీఎల్పీ నేతగా శాసన సభలో ప్రకటించిన జానారెడ్డి నేడు ఎందుకు మాట తప్పారని ప్రశ్నించారు. దేశంలో కాంగ్రెస్ పార్టీకి అతీగతీ లేదని, ఆ పార్టీ నాయకులు ఇచ్చే మాటలకు గ్యారంటీ ఉండదన్నారు. 100 ఏండ్ల చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డిని పీసీసీ అధ్యక్షుడిగా నియమించుకోవడం ఆ పార్టీ దౌర్భాగ్యం అన్నారు. కర్నాటకలో రూ.600 పింఛన్ ఇస్తున్న కాంగ్రెస్ పార్టీ, తెలంగాణలో మాత్రం తాము అధికారంలోనికి వస్తే రూ.3 వేలు ఇస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నాగార్జునసాగర్ నియోజకవర్గ ప్రజలు చైతన్యవంతులని, 2018, 2021 ఎన్నికల్లో జానారెడ్డిని ఓడించినట్లే ఈ ఎన్నికల్లో జానారెడ్డి కుమారుడిని ఓడించాలని కోరారు. ఉమ్మడి రాష్ట్రంలో పంచాయతీరాజ్‌శాఖ మంత్రిగా ఉన్న జానారెడ్డి నియోజకవర్గ ప్రజలకు కనీసం తాగునీటిని కూడా ఇవ్వలేక పోయారని విమర్శించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ తిరిగి అధికారంలోనికి వస్తే సౌభాగ్యలక్ష్మి పథకం కింద మహిళలకు నెలకు రూ. 3వేలు, రూ.400కే వంటగ్యాస్ సిలిండర్, రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం, రేషన్‌కార్డు ఉన్న ప్రతి ఇంటికీ రూ.5 లక్షల బీమా సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. రైతుబంధు పథకాన్ని ఎకరానికి రూ.10 వేల నుంచి రూ.16 వేలకు పెంచనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో 25 ఏండ్లలో కాంగ్రెస్ పార్టీ కేవలం 3 లక్షల ఎకరాలకు పోడుభూమి పట్టాలు ఇస్తే బీఆర్ఎస్ పార్టీ ఐదేండ్ల కాలంలోనే 4.06 లక్షల ఎకరాలకు పోడు పట్టాలను అందించినట్లు తెలిపారు. ఇంకా పట్టాలు రాని వారు ఉంటే ఎన్నికల అనంతరం బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రాగానే వారం రోజుల్లోనే సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గిరిజనులంతా బీఆర్ఎస్ పార్టీకి ఓటేసి నోముల భగత్ కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సత్యవతి రాథోడ్, చిత్రంలో ఎమ్మెల్యే నోముల భగత్ ఎమ్మెల్సీ కోటిరెడ్డి, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు రాంచందర్‌నాయక్, వాల్యానాయక్

## గిరిజనుల వెనుకబాటుకు కారకుడు జానారెడ్డే : ఎమ్మెల్యే నోముల భగత్

నాగార్జునసాగర్ నియోజకవర్గం, ఈ ప్రాంతంలోని గిరిజనుల వెనుకబాటుకు జానారెడ్డే కారణమని ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్ అన్నారు. 7 సార్లు ఎమ్మెల్యేగా జానారెడ్డిని గెలిపిస్తే నియోజకవర్గ అభివృద్ధిని గాలికొదిలేశారన్నారు. పేద ప్రజలు ఉన్నత చదువులు చదువుకుంటే తమను ప్రశ్నిస్తారని భావించిన జానారెడ్డి ఈ ప్రాంతంలో కనీసం ఒక్క ప్రభుత్వ డిగ్రీ కళాశాల గానీ, గిరిజన భవన్ గానీ ఏర్పాటు చేయలేదన్నారు. 35 ఏండ్లు ప్రతిపాదనలకే పరిమితమైన నెల్లికల్లు లిఫ్టును శంకుస్థాపన చేయడంతో పాటు దాని నిర్మాణానికి రూ. 687 కోట్లు మంజూరు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. డీ 8,9 కాల్వలపై ఏర్పాటు చేసిన లిఫ్టును ప్రారంభించ కుండా జానారెడ్డి అడ్డుకున్నాడని విమర్శించారు. 35 ఏండ్ల క్రితం డొక్కు స్కూటర్ కూడా లేని జానారెడ్డి నేడు వేల కోట్లకు అధిపతి ఎలా అయ్యాడో ప్రజలకు చెప్పాలన్నారు. ప్రజలను మరోసారి మోసం చేసేందుకు ఆయన కొడుకునే పంపుతున్నాడని, గిరిజనులంతా ఆయనకు తగిన రీతిలో బుద్ధి చెప్పాలని కోరాఆరు. రాబోయే ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజలు కారుగుర్తుకు ఓటు వేసి తనను మరోసారి గెలిపిస్తే.. ఎల్లవేళలా నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధిని కొనసాగిస్తానన్నారు.

## మూడోసారి అధికారం బీఆర్ఎస్‌దే : ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ అన్ని స్థానాల్లో విజయం సాధించి మూడో సారి సీఎంగా కేసీఆర్ అధికారం చేపట్టడం ఖాయమని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. సీఎం కేసీఆర్ పాలనలో తండాల రూపురేఖలే మారిపోయాయన్నారు. నెల్లికల్లు లిఫ్టును పూర్తి చేయడం బీఆర్ఎస్‌తోనే సాధ్యమవుతుందన్నారు. అందుకోసమే నియోజకవర్గ ప్రజలంతా ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని కోరారు.

## సీఎం కేసీఆర్ పాలనలోనే బాగుపడ్డ తండాలు : రాంచందర్‌నాయక్

సీఎం కేసీఆర్ పాలనలోనే గిరిజనులను జీవితాల్లో వెలుగులు నిండాయని, గిరిజన తండాలు బాగుపడ్డాయని ట్రైకార్ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్‌నాయక్ అన్నారు. తండాలను గ్రామ పంచాయతీలుగా చేయడం వల్లే మన గ్రామాన్ని మనమే పరిపాలించుకునే అవకాశం లభించిందన్నారు. మరోమారు బీఆర్ఎస్‌ను గెలిపించి తండాలను మరింతగా అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు.

## గిరిజనులకు కాంగ్రెస్ చేసిందేమీ లేదు : వాల్యానాయక్

దేశానికి స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి కాంగ్రెస్ పార్టీకి 55 ఏండ్లు ఓటేసి గెలిపించామని, అయినా ఆ పార్టీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చేసిందేమీ లేదని రాష్ట్ర గిరిజన కోఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ వాల్యానాయక్ అన్నారు. సీఎం కేసీఆర్ అధికారంలోనికి వచ్చాకే గిరిజన తండాలను పంచాయతీలుగా చేయడంతో రాష్ట్రంలో 3,116 మంది గిరిజనులు సర్పంచులుగా అయ్యారన్నారు. గిరిజనులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఆలోచించి ఓటేయాలని, బీఆర్ఎస్‌ను మరో మారు భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో జడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, జడ్పీటీసీ అబ్బిడి కృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జవ్వాజి వెంటేశ్వర్లు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాదం సంపత్‌కుమార్, కడారి అంజయ్య, బాబూరావునాయక్, విష్ణువర్ధన్‌రావు, కర్ణ బ్రహ్మారెడ్డి, వివేక్‌రావు, నియోజకవర్గ అధ్యక్షుడు భిక్షానాయక్, రవినాయక్, జయరాం, సీతారాంనాయక్, గుంటుక వెంకట్‌రెడ్డి, హాలియా మున్సిపల్ వైస్ చైర్మన్ నల్లగొండ సుధాకర్, బీఆర్ఎస్ నాయకులు మాజీ ఎంపీపీలు కూరాకుల అంతయ్య, అనుముల ఏడుకొండల్, ఎడవల్లి మహేందర్‌రెడ్డి, అల్లి పెద్దిరాజు, వివిధ గ్రామల సర్పంచులు పాల్గొన్నారు.

## జనసంద్రమైన హాలియా

గిరిజన ఆత్మగౌరవ సభకు నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని గిరిజనులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దాంతో హాలియా జనసంద్రమైంది. దేవరకొండ రోడ్డు నుంచి మిర్యాలగూడెం రోడ్డు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. గిరిజనులు నృత్యాలు చేస్తూ ఆటపాటలతో ర్యాలీలో పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న గిరిజనులు



సభకు హాజరైన గిరిజనులు



రిటర్నింగ్ అధికారి కార్యాలయం వద్ద బారికేడ్లు నిర్మిస్తున్న సిబ్బంది

## నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు

నిడమనూరు, అక్టోబర్ 29 : మండల కేంద్రంలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. నవంబర్ 3 నుంచి 10 వరకు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల నుంచి నామినేషన్లను స్వీకరించనున్నారు. అందుకోసం రిటర్నింగ్ కార్యాలయ ఆవరణలో బారికేడ్లను ఏర్పాటు చేస్తున్నారు. కార్యాలయం వద్ద భద్రతా ఏర్పాట్లను ఇప్పటికే ఎస్పీ పర్యవేక్షించి అధికారులకు సూచనలు చేశారు. నామినేషన్ల ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేసేందుకు రిటర్నింగ్ అధికారి జె. శ్రీనివాస్ పర్యవేక్షణలో తాసీల్దార్ జంగాల కృష్ణయ్య ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు.

## ఆంజనేయస్వామి ఆలయంలో మంత్రి సత్యవతి రాథోడ్ పూజలు

కొండమల్లేపల్లి, అక్టోబర్ 29: నాగార్జునసాగర్‌లో జరిగే గిరిజన సభకు వెళ్తూ మార్గమధ్యంలో మండలంలోని గుడితండా వద్ద మంత్రి సత్యవతి రాథోడ్ కొద్దిసేపు ఆగారు. గ్రామంలోని ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పథకాలపై ప్రజలకు వివరించి.. కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్‌ను మరో మారు అధికారంలోకి తేవాలని కోరారు. ఆమెకు స్థానిక బీఆర్ఎస్ నాయకులు స్వాగతం పలికారు.

### రాంచందర్‌నాయక్ ఇంటికి మంత్రి

త్రిపురారం : మంత్రి సత్యవతి రాథోడ్ ఆదివారం త్రిపురాం మండలంలోని సత్యంపాడు గ్రామంలోని రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్‌నాయక్ ఇంటికి వచ్చారు. ఈ సందర్భంగా రాంచందర్‌నాయక్ ఆమెకు స్వాగతం పలికి తేనేటి విందును ఏర్పాటు చేశారు. ఆమె వెంట ఎమ్మెల్యే నోముల భగత్, నాయకులు ఉన్నారు. పెద్దవూర : మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యకర్త ఇంటికి మంత్రి సత్యవతి రాథోడ్ వచ్చారు. నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భగత్ గెలుపునకు కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని కోరారు. ఆమె వెంట బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గోనే విష్ణువర్ధన్‌రెడ్డి , స్థానిక సర్పంచ్ నడ్డి లింగయ్య యాదవ్, నాయకులు కర్నాటి మునిరెడ్డి, కూరకుల అంతయ్య యాదవ్ ఉన్నారు.



మంత్రికి స్వాగతం పలుకుతున్న రాంచందర్‌నాయక్

## నామినేషన్లకు పకడ్బందీగా ఏర్పాట్లు

- కలెక్టర్ వెంకట్రావ్

సూర్యాపేట, అక్టోబర్ 29 : సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ నవంబర్ 3 నుంచి ప్రారంభమవుతుందని, అందుకోసం పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ తెలిపారు. ఆదివారం కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ప్రక్రియలో పోస్టల్ బ్యాలెట్, సువిధయాప్ ద్వారా అనుమతులు, కౌంటింగ్ హాల్, కౌంటింగ్ ఏజెంట్ల నియామకం, నామినేషన్లు, వాటి నిబంధనల గురించి రాజకీయ పార్టీల ప్రతినిధులు అవగాహన కలిగి ఉండాలన్నారు. నియోజకవర్గ కేంద్రంలోని రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో నామినేషన్ ప్రక్రియ ఉంటుందన్నారు. నామినేషన్ల స్వీకరణ తేదీ నుంచి గడువు ముగిసే వరకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఆయా కార్యాలయం చుట్టూ 100 మీటర్లు పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు.